క్లుప్తంగా

నేటి నుంచి కోనేటిరాయ స్వామి పవిత్రోత్సవాలు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల కోనేటిరాయస్వామి ఆలయంలో మంగళవారం నుంచి నాలుగు రోజులు స్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం అంకురార్పణతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రొంపిచెర్ల: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలా మంది మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటారని తెలిపారు. వారిని ఇబ్బంది పెట్టకుండా బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

పుంగనూరు: పట్టణంలోని విద్యుత్ శాఖ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించేంత వరకు నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

పలమనేరు: టీచర్ల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రణభేరిలో భాగంగా సోమవారం టీచర్లు పలమనేరులో బైక్ ర్యాలీ నిర్వహించారు.

దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

కుప్పం రూరల్: దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు తెలిపారు. కళాశాల ఆవరణలో సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. బీసీ నాగరాజు, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ దేశ ఉన్నతిలో ఎంతో మంది ఇంజినీర్ల మేధస్సు ఉందన్నారు. అలాంటి వారిలో ఉత్తమోత్తముడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. పరిశోధనలో కళాశాల అధ్యాపకులు చూపిన చొరవకు రూ.2 లక్షల విలువైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, ఆర్‌అండ్ఆర్ డైరెక్టర్ కోదండరామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే

పుంగనూరు: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు సోమవారం ఇంజినీర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. మోక్షగుండెం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగులు మాట్లాడుతూ భారత దేశం గర్వించదగ్గ తొలితరం ఇంజినీరింగ్ నిపుణుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో పులినాడు విద్యార్థుల ప్రతిభ

పుంగనూరు: కరాటే పోటీలలో పులినాడు అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారని కరాటే మాస్టర్ సదాశివ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న కర్నూలులో డబ్ల్యూకేఎఫ్ రెఫరీ జగదీష్‌కుమార్, ఇండియన్ హెడ్ కోచ్ కీర్తన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో పుంగనూరుకు చెందిన పులినాడు అకాడమీ విద్యార్థులు 44 మంది వివిధ విభాగాల్లో ప్రతిభ చూపి 20 బంగారు పతకాలు, 12 రజిత పతకాలు, 10 కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు: పట్టణంలోని దూళ్లవాండ్లఇండ్లలో వున్న బోయకొండ గంగమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అభిషేకాలు, హోమాలు చేశారు. మహిళలు నిమ్మకాయల దీపాలు వెలిగించారు. పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు.

దినదిన గండం

నిత్యం ప్రమాదాలతో సావాసం చేస్తూ.. ఏనుగులు గ్రామాల వైపు రాకుండా చేసే బాధ్యత వారిది. ఇల్లు వదిలి వెళ్లాక తిరిగి ఇంటికి చేరే వరకు ప్రాణాలకు గ్యారెంటీ లేని జీవితాలు వారివి.. కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల మళ్లింపులో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న ట్రాకర్స్ జీవితాలకు భరోసాలేదు. వన్యప్రాణుల సంరక్షణ కోసం పనిచేస్తున్న ట్రాకర్స్ బాధలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను అతికష్టం మీద నెట్టుకొస్తున్నారు. తమకు తగిన భద్రత కల్పించడంతోపాటు వేతనాలు పెంచాలని వారు కోరుతున్నారు.


ఏనుగులను మళ్లిస్తున్న ట్రాకర్స్(ఫైల్)



- ఏనుగుల మళ్లింపులో ట్రాకర్స్ కీలకం
- ఏగుల దాడుల్లో గాయపడుతున్న వైనం
- వారి భద్రతను పట్టించుకోని అటవీశాఖ అధికారులు

పలమనేరు: పలమనేరు కౌండిన్య అభయారణ్యానికి సంబంధించి 14 బీట్లున్నాయి. ఇందులో రెండు మినహా మిగిలిన 12 బీట్లలో 40 వేల హెక్టార్లలో దట్టమైన అటవీ ప్రాంతముంది. ఇక్కడ ఏనుగులు ఎక్కువగా వున్నాయి. అవి అడవిని దాటి పొలాలపైకి వచ్చి పంటలను నాశనం చేస్తూనే వున్నాయి. ఈ క్రమంలో ఏనుగులు పొలాలపైకి రాకుండా, ప్రజలపై దాడులు చేయకుండా వాటిని దారిమళ్లించేందుకు పదేళ్ల క్రితం ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను అటవీశాఖ ఒప్పంద రీత్యా నియమించుకుంది. ఆ మేరకు పలమనేరు, కుప్పం రేంజ్ పరిధిలో బీట్ల వారిగా ఎనిమిది నుంచి పది కిలోమీటర్ల వరకు ఓ ట్రాకర్ చొప్పున 60 మందికిపైగా నియమించింది. వీరికి నెలకు రూ.13,113లు చెల్లిస్తున్నారు. వారు తమ పరిధిలో అడవిలో బేస్ క్యాంపును నిర్వహిస్తూ ఏనుగుల జాడను పసిగడుతూ ఉండాలి. ఏనుగులు వచ్చినప్పుడు రేయనక, పగలనక అడవిలో ఉండాల్సిందే. పంటపొలాల వైపు ఏనుగులు వచ్చినప్పుడు టపాకాయలు పేలుస్తూ, డప్పులు వాయిస్తూ అడవి వైపు మళ్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా సోలార్ ఫెన్సింగ్ నిర్వహణ, ఇతర వన్యప్రాణుల సంరక్షణ, అపరిచితులు అడవుల్లోకి వెళితే గుర్తించడం తదితర విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఒక్కోసారి రెండు మూడు రోజులైనా వీరు అడవిలో గడపాల్సి వస్తుంది. పొరబాటున ఏనుగులు దాడి చేస్తే ఇక అంతే సంగతులు. ఇంత ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న ట్రాకర్స్‌కు అటవీశాఖ కనీసం సరైన శిక్షణ కూడా ఇవ్వలేదు. భద్రతా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతో పాటు జీవితాలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అధునాతన పరికరాలను ఇవ్వాలని ట్రాకర్స్ కోరుతున్నారు.

ఏనుగుల నుంచి తప్పని ముప్పు

గతంలో రామకుప్పం మండలంలో జరిగిన ఏనుగుల దాడిలో కాంట్రాక్ట్ వాచర్ మునెప్ప మృతి చెందాడు. ఇతని కుటుంబానికి అటవీ శాఖ కొంత మొత్తం అందించి చేతులు దులుపుకుంది. పలమనేరు రేంజ్ కాలువపల్లె బీట్‌కు చెందిన దేవప్ప ట్రాకర్‌గా మంచి సిద్ధహస్తుడు. రోడ్డు ప్రమాదంలో కాలుకు తీవ్రమైన దెబ్బ తగిలినా సాయం దక్కలేదు. గతంలో కాలువపల్లి బీట్‌లో ముగ్గురు ట్రాకర్స్‌పై ఏనుగులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. రెండ్రోజుల క్రితం పలమనేరులో ఒంటరి ఏనుగు దాడిలో ఒక ట్రాకర్ గాయపడిన విషయం తెలిసిందే.


ఏనుగుల దాడిలో గాయపడిన ట్రాకర్(ఫైల్)

అడవిలోకి వెళితే ఇంటికొస్తామనే గ్యారెంటీ ఉండదు

అడవిలోకి వెళితే మళ్లీ ఇంటికి వచ్చే వరకు భయంగానే ఉంటుంది. ఏనుగులను మళ్లించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. మాకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వలేదు. సురక్షతమైన పరికరాలు, ఏనుగుల దాడుల నుంచి తప్పించుకునే బెలూన్ యూనిఫామ్స్ ఇవ్వాలి. వేతనాలు పెంచాలి. మొన్న పలమనేరులో ఎఫ్ఎస్వోపై ఏనుగు దాడి చేసినప్పుడు నేను అక్కడే ఉన్నా.

– నాగరాజు, ఎలిఫెంట్ ట్రాకర్

ఉన్నతాధికారులతో చర్చిస్తాం

అడవిలో ట్రాకర్స్ విధుల నిర్వహణ కష్టతరమే. ముఖ్యంగా ఏనుగులను మళ్లించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం ఏమారినా ప్రాణాలకు ముప్పు తప్పదు. తాజాగా జరిగిన సంఘటన మమ్మల్ని కలచివేసింది. ఈ క్రమంలో ట్రాకర్స్ భద్రతపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తాం. వారికి ప్రత్యేక పరికరాలు, సేఫ్టీ యూనిఫాం అందించాలని కోరతాం.

–నారాయణ, ఎఫ్ఆర్వో, పలమనేరు రేంజి

నోటీస్ బోర్డు

నేడు క్రీడా పోటీలు

చౌడేపల్లె: మండలంలోని చారాల జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ఐ క్రీడల్లో భాగంగా మండలస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు హాజరై విజయవంతం చేయాలని వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర తెలిపారు.

నేడు బోయకొండలో వేలం పాటలు

చౌడేపల్లె: బోయకొండ గంగాపురంలో గల షాపింగ్ కాంప్లెక్స్‌లోని 85 రూముల్లో మూడేళ్లపాటు వ్యాపారం నిర్వహించుకునే హక్కు కోసం మంగళవారం వేలం పాటలు, సీల్డు టెండర్లు నిర్వహించనున్నట్లు ఈవో ఏకాంబరం తెలిపారు.

రేపు మండల మీట్

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో షబ్బీర్ అహమ్మద్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

17, 18 తేదీల్లో క్రీడా పోటీలు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 17, 18 తేదీల్లో అండర్– 14, 17 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం తెలిపారు. ఈక్రీడల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. ఈనెల 17న వాలీబాల్, ఖో–ఖో, బ్యాడ్మింటన్, 18న కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. అండర్– 14 విద్యార్థులు జనవరి–2012 తర్వాత జన్మించి ఉండాలని, 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు అర్హులన్నారు. అండర్–17 విద్యార్థులు జనవరి 2009 తర్వాత జన్మించి ఉండాలని, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన విద్యార్థులు అర్హులన్నారు.

వాలీబాల్ పోటీల విజేత మర్రిమాకులపల్లె జట్టు

చౌడేపల్లె: మండలంలోని మేకలచిన్నేపల్లె ఉన్నత పాఠశాలలో సోమవారం అండర్–14, అండర్–17 స్కూల్ గేమ్స్ బాలబాలికల విభాగాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సీనియర్ బాలికల విభాగంలో మర్రిమాకులపల్లె జట్టు విజేతగా, కాటిపేరి జట్టు రన్నర్‌గా నిలిచినట్టు హెచ్‌ఎం చంద్రశేఖర్, స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ వెంకటేష్ తెలిపారు. జూనియర్ బాలికల విభాగంలో విజేతగా కాటిపేరి జట్టు, రన్నర్‌గా ఏ.కొత్తకోట జట్టు నిలిచాయి. సీనియర్ బాలుర విభాగంలో విన్నర్‌గా ఏ.కొత్తకోట జట్టు, రన్నర్‌గా చారాల జట్టు, అండర్–14 జూనియర్ బాలుర విభాగంలో విన్నర్‌గా ఏ.కొత్తకోట జట్టు, రన్నర్‌గా కాటిపేరి జట్టు నిలిచాయి. విజేతలకు ఎంఈవో తిరుమలమ్మ, మేకలచిన్నేపల్లె హెచ్‌ఎం చంద్రశేఖర్, గేమ్స్ కోఆర్డినేటర్ వెంకటేష్ బహుమతులను అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు రాజేంద్ర, గాయిత్రి, పవన్‌కుమార్, వంశీ, భవాని, సరస్వతి పాల్గొన్నారు.


సీనియర్ బాలికల విన్నర్ జట్టుతో ఉపాధ్యాయ బృందం

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

పలమనేరు: స్థానిక బాలుర పాఠశాలలో సోమవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. వాలీబాల్ పోటీలను ఎంఈవో లీలారాణి ప్రారంభించారు. ఇందులో భాగంగా మంగళవారం అండర్–14, అండర్– 17 విభాగాల్లో యోగా, చెస్ పోటీలు, 16న ఖోఖో, 17న కబడ్డీ, 18న అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని ఎంఈవో తెలిపారు.

అండర్–19 ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు విద్యార్థి ఎంపిక

పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.పూజిత అండర్–19 ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో ఇటీవల నిర్వహించిన అండర్–19 చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్‌లో జి.పూజిత ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఆమెను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ వెంకటరమణ, ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటరమణారెడ్డి, మణి, రమణమ్మ, శంకర్‌రెడ్డి, రఘు, సుజాత పాల్గొన్నారు.


విద్యార్థి పూజితతో హెచ్‌ఎం వెంకటరమణ

గురువులు సమాజ నిర్దేశకులు

పలమనేరు: గురువులు సమాజ నిర్దేశకులని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం గురువులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో కొలువులు సాధించిన నిరుద్యోగులు ఎమ్మెల్యేను సన్మానించారు. పలమనేరు ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల మెమో నంబరు 57ను వర్తింప జేయాలంటూ నియోజకవర్గ ఉద్యోగులు ఎమ్మెల్యేకు విన్నవించారు.


గురువులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమరనాథ

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ హిందీ భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలన్నారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో హిందీ ఒకటన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ప్రజలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట: పట్టణానికి చెందిన వి.కోట గ్రేటర్ లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం 500 మంది పేదలకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ సంస్థలోని సభ్యుల జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి నెలా 15వ తేదీన పట్టణంలోని కేజీఎఫ్ బస్టాండు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వి.కోట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తమీమ్, సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే ఇసుక, ఇటుకలు



చౌడేపల్లె: మండలంలోని కాగతి గ్రామంలో గల బీసీ కాలనీకి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన సిమెంటు రోడ్డుపై ఇసుక, ఇటుకలు వేయడంతో నడిచేందుకు వీలుకావడం లేదని స్థానికులు ఆరోపించారు. వారు సోమవారం రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పాఠశాలకు పుస్తకాల వితరణ


సదుం: పుస్తకాలను అందజేస్తున్న నాగరాజు

సదుం: మండలంలోని పాలమంద జెడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం పుంగనూరుకు చెందిన ఎస్ఆర్ఐ భవ్య రూ.6 వేలు విలువైన జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు వితరణ చేశారు. వాటిని ఆమె తాతయ్య నాగరాజు హెచ్‌ఎం నిరంజన్‌కు అందజేశారు. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం కోరారు. విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను నిత్యం పఠించాలని సూచించారు.

బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ

గంగవరం: పలమనేరు రూరల్ మండలం ఎం.కొటూరులో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు షూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి చంద్రబాబునాయుడు పథకాల అమలులో చేస్తున్న మోసాన్ని వివరించారు. కూటమి నేతలు చేస్తున్న అరాచకాలు, అవినీతిని తెలియజేశారు. జగనన్న ప్రభుత్వంలో మాత్రమే సుపరిపాలన సాధ్యమైందని పేర్కొన్నారు.


బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

పేద రెడ్లను ఆదుకోవాలి

పలమనేరు: రాష్ట్రంలోని పేద రెడ్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర రెడ్డి సంఘం సలహాదారు అమరనాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఆర్డీవో భవానికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని జనాభాలో 60 శాతం మంది రెడ్లు ఉన్నారని తెలిపారు. వారిలో 90 శాతం మంది కడు పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లెకు బాలిక (13) అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఆమె ఈ నెల 10న ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లింది. కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆచూకీ తెలిసిన వారు చౌడేపల్లె పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్లాస్టిక్ కవర్ల నియంత్రణలో భాగస్వాములు కావాలి

పుంగనూరు: ప్లాస్టిక్ రహిత పుంగనూరు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం పట్టణంలోని దుకాణదారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులు గుడ్డ సంచులు, పునర్వినియోగ బ్యాగులను విక్రయించాలన్నారు. వాటికి ప్రజలు అలవాటుపడేలా అవగాహన కల్పించాలని కోరారు. అలా చేసినప్పుడే పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను నియంత్రించవచ్చన్నారు. త్వరలోనే తమ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు.


దుకాణాదారులతో మాట్లాడుతున్న మున్సిపల్

ఎరువుల దుకాణాల తనిఖీ

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని ఎరువుల దుకాణాలను సోమవారం తిరుపతికి చెందిన విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు రామాంజనేయరెడ్డి, గురుప్రసాద్ తనిఖీలు చేశారు. పుడమి కిసాన్ మార్టు, మనగ్రోమోర్ దుకాణాల రికార్డులు, యూరియా విక్రయాలకు సంబంధించిన రికార్డులు, పాసుపుస్తకాల జిరాక్సులు, టోకెన్లను పరిశీలించారు. స్టాకు వివరాలపై ఆరా తీశారు. గత రెండు రోజులుగా యూరియా కొనుగోలు చేసిన రైతులకు రాండమ్‌గా ఫోన్లు చేసి ఆరా తీశారు. మండలానికి మళ్లీ యూరియా రానుందని ఎటువంటి సమస్య లేకుండా రైతులకు పారదర్శకంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏవో మోహన్‌కుమార్‌ను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలోని ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

చౌడేపల్లె 108కు అనారోగ్యం

- నెల నుంచి షెడ్డుకే పరిమితం
- అత్యవసర పరిస్థితుల్లో వేరే మండలం నుంచి రాక
- క్షతగాత్రులకు సమయానికి అందని వైద్యం

ఆపద సమయంలో కాల్ చేసిన నిమిషాల వ్యవధిలో కుయ్..కుయ్.. అంటూ వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లే చౌడేపల్లె 108 అంబులెన్స్‌కు అనారోగ్యం చేసింది. మరమ్మతులకు గురై నెల రోజులుగా షెడ్డుకే పరిమితమైంది. అత్యవసర సమయంలో ఇతర మండలాల నుంచి వాహనం రావాల్సి వస్తోంది. దీంతో సమయానికి వైద్యం అందక క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు.

–చౌడేపల్లె


మరమ్మతులకు గురైన 108 వాహనం

అత్యవసర పరిస్థితుల్లో పేదలు, రోగులు, క్షతగాత్రులు సమయానికి ఆస్పత్రికి వెళ్లలేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 108 అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, అత్యవసర వైద్యం కావాల్సిన వారు 108 నంబర్‌కు ఫోన్ చేయగానే కుయ్..కుయ్..మంటూ నిమిషాల వ్యవధిలో ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరింతగా బలోపేతం చేశారు. మండలానికి ఒకటి చొప్పున 108 అంబులెన్స్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. తద్వారా పేదలకు సకాలంలో వైద్యం అందేలా చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 సర్వీసులను నిర్వీర్యం చేస్తున్నారు.

చౌడేపల్లె మండలంలో ప్రసిద్ధి చెందిన బోయకొండ గంగమ్మ, రాజనాల బండ ఆంజనేయ స్వామి, మృత్యుంజయేశ్వరస్వామి ఆలయాలు వున్నాయి. తిరుపతి, తిరుమల, కాణిపాకం ఆలయాలకు వెళ్లే భక్తులు ఇక్కడికి వచ్చి దర్శించుకుని వెళుతుంటారు. వాహనాల తాకిడి కూడా ఎక్కువగా వుంటుంది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో 108 వాహనం మరమ్మతులకు గురై షెడ్డ్‌కే పరిమితమైంది. ప్రమాదాలు జరిగి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు 108కు ఫోన్ చేస్తే పుంగనూరు, లేదా పెద్దపంజాణి, పలమనేరు ప్రాంతాల నుంచి వాహనం రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో క్షతగాత్రులకు సరైన సమయంలో చికిత్స అందడం లేదు. చౌడేపల్లె మండలంలో వారం రోజుల్లో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. స్థానికులు 108కు ఫోన్ చేసినా రెండు గంటల వరకు రాలేదు. దీంతో గాయపడిన వారిని ప్రయివేటు వాహనాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి 108 అంబులెన్స్‌కు మరమ్మతులు చేయించాలని మండలవాసులు కోరుతున్నారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 108 అంబులెన్స్ కోసం ఎదురు చూస్తున్న క్షతగాత్రులు విశ్వనాథ్, హారతి(ఫైల్)

బైక్ నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

పుంగనూరు: పట్టణంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద సోమవారం బైక్ నుంచి పడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ఎన్ఎస్.పేటకు చెందిన రియాజ్ కుమారుడు ఇద్రీష్(20) బైక్‌లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి ఇంటికి బయలుదేరాడు. ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయమైన అతన్ని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.